క్లుప్తంగా

ప్రమాణస్వీకారం

మోతీనగర్: మోతీనగర్‌లో లయన్స్‌క్లబ్ బంజారాహిల్స్ శాఖ 51వ అధ్యక్షుడిగా ఆదివారం లయన్ కెల్లా వెంకట్రావు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో అందరి సహాయ సహకారాలతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసరా ఆర్గనైజేషన్ ప్రతినిధి హబీబ్ సుల్తాన్, మహేంద్రకుమార్‌రెడ్డి, జగన్నాథం, గోపాలకృష్ణ, సత్యనారాయణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్‌లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించామని కార్పొరేటర్ సబిహా బేగం పేర్కొన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్, గణేష్ మండపం పార్కులో అభివృద్ధిలో భాగంగా బోర్‌వెల్ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రూ.50లక్షల నిధులతో గణేష్ మండపం పార్కును అభివృద్ధి చేశారని తెలిపారు. అందులో భాగంగానే పచ్చదనం కోసం నీటి వసతి లేకుండా బోర్ వేయిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, టోపీచారి, రవీందర్‌రెడ్డి, సంజీవ్, రమణ, రాజశేఖర్ రెడ్డి, నిశాంత్, గోపాల్‌రెడ్డి, రాంమోహన్, ఉమామహేశ్వర రావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'మనూ' దరఖాస్తుల గడువు ఈనెల 30 వరకు పొడిగింపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో రెగ్యులర్, మెరిట్ ఆధారిత కోర్సుల దరఖాస్తు గడువు పెంచారు. మెరిట్ ఆధారిత రెగ్యులర్ కోర్సుల కోసం దరఖాస్తు ఫారమ్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీని ఈనెల 30వ తేదీ వరకు పొడిగించారు. ఫారమ్ సవరణకు జూలై 31, ఆగస్టు 1వ తేదీ వరకు అవకాశం కల్పించారు. అంతకుముందు చివరి తేదీ జూలై 24 వరకు అవకాశం ఉండేది. మరిన్ని వివరాలకు ఇతర ఫోన్ నంబర్లు 98668 02414, 62077 28673 ను సంప్రదించవచ్చు.

నేడు వెయ్యి మంది ఐటీ ఉద్యోగుల రక్తదానం

రాయదుర్గం: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కె.తారకరామారావు జన్మదినం సందర్భంగా సోమవారం ఒకే రోజు 1000 మంది ఐటీ ఉద్యోగులు రక్తదానం చేసేలా ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తెలంగాణ ఫెసిలిటీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్(టీఎఫ్ఎంసీ) ఆధ్వర్యంలో రాయదుర్గం మధురానగర్‌లోని దివ్యశ్రీ ఎన్ఎస్ఎల్ ఐటీ పార్కులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శనివారం టీఎఫ్ఎంసీ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మాట్లాడుతూ, ఐటీ టవర్‌లో 10 వేల మంది పని చేస్తున్నారని, అందులో కనీసం 1000 మంది ఐటీ ఉద్యోగులు రక్తదానం చేస్తారని భావిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు 'గిఫ్ట్ ఏ స్మైల్' పేరిట రెడ్‌క్రాస్ సొసైటీ సహాయం ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు మెగా రక్తదాన శిబిరం

గచ్చిబౌలి: బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా సోమవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ తెలిపారు. కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో ఉదయం 9.30 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

పద్య నాటకం

కూకట్‌పల్లిలోని భారత్ వికాస్ పరిషత్‌లో రజనీ శ్రీకళ నిర్వహణలో శ్రీకళా నటనాలయం ఆధ్వర్యంలో ఆదివారం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రంగస్థలం శ్రీనివాస్ మొదటి వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ రాయభారం పద్యనాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాజా ఇన్నరా అధినేత రాజబాబు కళాకారులను సత్కరించారు. – కూకట్‌పల్లి



18వేల నోట్‌బుక్స్‌తో కేటీఆర్

కూకట్‌పల్లిలోని టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్‌మోహన్ కార్యాలయంలో ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకలను వినూత్న పద్ధతిలో నిర్వహించారు. 18వేల నోట్‌బుక్స్‌తో కేటీఆర్ మొసాయిక్ ఆర్ట్ చిత్రీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామన్న జన్మదినం పురస్కరించుకొని గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా 18వేల నోట్ బుక్స్‌ని విద్యార్థులకు పంపిణీ చేస్తామని తెలిపారు. – కూకట్‌పల్లి



ముంపు సమస్య పరిష్కరించేదెన్నడు?

- వర్షాలకు నీట మునుగుతున్న లోతట్టు ప్రాంతాలు
- అవస్థలు పడుతున్న స్థానికులు
- శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్

కూకట్‌పల్లి: గత అయిదు రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు రావటంతో ఇళ్లల్లో నివసిస్తున్న ప్రజలు అన్నపానీయాలు లేక జాగరణ చేయాల్సిన దుస్థితి నెలకొంది. కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్‌లోని సఫ్దార్‌నగర్, రాజీవ్‌గాంధీ నగర్‌లలోని సుమారు 500 ఇళ్లల్లోకి వర్షపు నీరు ఇళ్లలోకి ప్రవహించటంతో ఇబ్బందులకు గురయ్యారు. ప్రతి సంవత్సరం ఈ సమస్య అక్కడ నివసించే వారికి సర్వ సాధారణమైంది.

◆ వర్షాలు కురిసినప్పుడల్లా స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు అప్పటికప్పుడు హడావుడి చేసి తరువాత చేతులు దులుపుకొని షరా మామూలే అంటూ వ్యవహరించటం సర్వసాధారణమైంది. ఇళ్లు మునిగిపోవటానికి కారణం ఆ ప్రాంతలో ఇళ్ల మధ్యలో ఉన్న ఓపెన్ నాలాలు, చుట్టూ ఉన్న చెరువులు కబ్జాకు గురై కుంచించుకుపోవడమే. నీటి ప్రవాహం సాఫీగా లేక రోడ్డుపై ప్రవహించే వర్షపు నీటితో పాటు చెరువు, కుంటల్లో నీరు కూడా ఇళ్లలోకి చేరుతోంది.

◆ అల్లాపూర్, బాలాజీనగర్, మూసాపేట డివిజన్‌ల పరిధిలో ఉన్నటువంటి చెరువులు, కుంటల సమీపంలో బహుళ అంతస్తులు నిర్మించటం కూడా ఒక కారణం. నిరుపేదలు నివసించే ఈ ప్రాంతాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నాలా పరీవాహక ప్రాంతాల విస్తరణ చేయకపోవటంతో ఈ సమస్య ప్రతి సంవత్సరం నెలకొంటోంది. రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత నియోజకవర్గంలోని చెరువులను సుందరీకరణ



పేరిట పనులు చేపట్టినప్పటికీ అవి మూణ్నాళ్ల ముచ్చటగానే తయారయ్యాయి.

◆ అదే విధంగా ఇళ్ల మధ్యన ఉన్న నాలా విస్తరణ పనులు 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే'అన్న చందంగా తయారయ్యాయి. గతంలో అకాల వర్షాలు కురిసినప్పుడు ఇళ్లల్లోకి నీరు చేరిన ప్రాంతాల్లో నివాసం ఉన్న బాధితులు రూ.10వేల చొప్పున అందజేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు హడావుడి చేసి వర్షం తగ్గగానే మిన్నకుండిపోతున్నారు. అకాల వర్షాలు తగ్గిన వెంటనే ఆ ప్రాంతాన్ని కన్నెత్తి చూసే నాథుడే కరువయ్యారు.



రాజీవ్‌గాంధీనగర్‌లో, సఫ్దార్‌నగర్‌లో ఇంట్లోకి నీళ్లు రావటంతో మంచంపై పెట్టిన వస్తువులు



◆ ఈ సంవత్సరం సాధారణ ఎన్నికలు సమీపిస్తుండటంతో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు సైతం ముందుకు వచ్చి సహాయం చేయటానికి ఉత్సాహపడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రాజకీయాలకు అతీతంగా ఇళ్ల మధ్యన ఉన్న కుంచించుకుపోయిన నాలాల విస్తరణతో పాటు చెరువు చుట్టూ అక్రమంగా వెలిసిన బహుళ అంతస్తులతో పాటు, అక్రమ నిర్మాణాలను తొలగిస్తే తప్ప ఇళ్ల ముంపుతప్పే పరిస్థితి లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఉషాముళ్లపూడి రోడ్డులో.. డివైడర్ సమస్యను పరిష్కరించాలి

భాగ్యనగర్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ నవోదయా కాలనీవాసులు ఆదివారం ఉషాముళ్లపూడి రోడ్డులోని డివైడర్ విషయంలో ఆందోళన వ్యక్తం చేశారు. అసలే ఇరుకైన రోడ్డు. డివైడర్ రోడ్డు మధ్యలోనుంచి 100 అడుగుల రోడ్డు నిర్మించాలని సూచించారు. డివైడర్ ఏర్పాటు చేయటం వల్ల వాహనాలు ×యూ టర్న్‌×తీసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. ఎల్లమ్మ చెరువు వద్ద ఉన్న చౌరస్తాలో డివైడర్‌ను తొలగించి నాలుగు రోడ్లకు అనుసంధానం చేస్తే కొంతమేర ట్రాఫిక్ సమస్య తగ్గి ఎక్కడి వాహనాలు అక్కడికి వెళ్లిపోయే అవకాశం ఉందన్నారు. మరోవైపు రోడ్డు పక్కనే ఎల్లమ్మ చెరువుకు అనుకొని ఉన్న ఖాళీ స్థలంలో ఇష్టానుసారంగా చిరు వ్యాపారులు షాపులు ఏర్పాటు చేసుకొని వారికి అడ్డాగా మార్చుకున్నారని తెలిపారు.

◆ దీనిపై ప్రశ్నిస్తే తమకు మున్సిపాలిటీ నుంచి ఉన్నతాధికారుల అండదండలు ఉన్నాయంటూ దురుసుగా మాట్లాడుతున్నారని తెలిపారు. దీనికి తోడు చికెన్‌కు సంబంధించిన వ్యర్థాలను పక్కనే



ఉషాముళ్లపూడి రోడ్డులో ఆందోళన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

పడవేయటంతో దుర్వాసన వెదజల్లుతోందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని రోడ్డు డివైడర్‌ను మధ్యలో తీసుకొని మొత్తం రోడ్డు 100 అడుగులకు పెంచాలన్నారు. తమ కాలనీకి ఎదురుగా ఉన్న చిరువ్యాపారాలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో గణేష్, శివశంకర్, వెంకటేశ్వర్లు, ఫణిస్వామి, కిషోర్ రెడ్డి, లక్ష్మణ్, మదన్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ పెంపుపై సర్వత్రా హర్షం




సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, కార్పొరేటర్

బాలానగర్: రాష్ట్రంలో దివ్యాంగులకు ఇస్తున్న పెన్షన్‌ను మరో వెయ్యి రూపాయలు పెంచుతున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనపై ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం దివ్యాంగులతో కలిసి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దివ్యాంగుల పాలిట దేవుడిని వారు అభివర్ణించారు. సీఎం కేసీఆర్ మరోసారి గొప్ప మనసును చాటుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో 5లక్షల మంది దివ్యాంగులు లబ్ధిపొందనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కంచి భిక్షపతి, కె. రాము ముదిరాజ్, కె. కీర్తి, గట్ల శేఖర్, రహీమా, సురేందర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పెన్షన్ పెంపు చరిత్రాత్మక నిర్ణయం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఆల్విన్‌కాలనీ: తెలంగాణ రాష్ట్రంలోని దివ్యాంగులకు పెన్షన్ మొత్తాన్ని రూ.3016 నుంచి రూ.4016కు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ దివ్యాంగుల పట్ల నిజమైన బాంధవుడన్నారు. ఈ చరిత్రాత్మక నిర్ణయంతో 5 లక్షల మందికి పైగా దివ్యాంగులకు ప్రయోజనం చేకూరనుందన్నారు. దేశానికే ఆదర్శంగా మానవీయ కోణంలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రమరో చారిత్రక ఘట్టానికి వేదికగా నిలిచిందన్నారు. మంచిర్యాల సభ వేదికగా దివ్యాంగుల పెన్షన్‌ను పెంచబోతున్నట్లు ప్రకటించిన సీఎం కేసీఆర్ సంబంధిత ఫైల్‌ను ఆమోదించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా దివ్యాంగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. అత్యధిక ఫించన్లు ఇస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు.

'అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌లో చేరుతున్నారు'

కూకట్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో విరివిగా చేరుతున్నారని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. ఆదివారం బాలానగర్ డివిజన్ ఇందిరానగర్‌కు చెందిన ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బాలస్వామి ఆధ్వర్యంలో సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ ఆయన పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. బాలానగర్ డివిజన్ ఇంద్రనగర్‌లో పేదల ఇళ్లు కాపాడుతూ మంత్రి కేటీఆర్ సహకారంతో ఇంటింటికీ మంచినీరు, కరెంటు అందజేశామన్నారు. ఐడీపీఎల్ స్థలంలో నిరుపేదలు గుడిసెలు వేసుకొని ఉంటే కేసీఆర్ ప్రభుత్వం కాపాడుతుంటే, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కూల్చాలని లేఖరాశారని పేర్కొన్నారు.



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు

'హరే రామ.. హరే కృష్ణ'



నిజాంపేట్: నిజాంపేట్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో వారం రోజుల పాటు జరిగిన 'హరే రామ హరే రామ రామ రామ హరే హరే.. హరే కృష్ణ హరే కృష్ణ, కృష్ణ కృష్ణ హరే హరే'మూల మంత్ర పఠనం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన హోమ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొలన్ శ్రీనివాస్‌రెడ్డి, భక్తజనం పాల్గొన్నారు. మధ్యాహ్నం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న సంతర్పణ చేయగా పెద్ద సంఖ్యలో భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు.

మహిళ అదృశ్యం



పారిక (ఫైల్)

బాలానగర్: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తేజ్ డకల్ అనే వ్యక్తి నేపాల్ నుంచి వచ్చి పద్మారావు నగర్ ఫేజ్-1లో తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు.తేజ్ డకల్ అక్క కమల్‌బజార్ పారిక(30) భర్త,పిల్లలను నేపాల్‌లో ఉంచి ఒక్కతే వచ్చి తల్లిదండ్రులతో కలిసి పద్మారావునగర్ ఫేజ్-1లో నివాసం ఉంటు ఇళ్లలో పనులు చేసుకుంటోంది. ఈనెల 20వ తేదీ ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తేజ్ డకల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సీజనల్ విక్రయాలు



హెచ్ఎంటీ ప్రధాన రహదారిలో...

జగద్గిరిగుట్ట: రెయిన్ కోట్‌ల అమ్మకాలు ఊపందుకున్నాయి. ముఖ్యంగా ఉద్యోగస్తులు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానలకు రెయిన్ కోట్ కొనుగోలు చేయక తప్పడం లేదు. దీంతో వీటి డిమాండ్ పెరిగింది. రూ.350 నుంచి రూ.700 వరకు రెయిన్ కోట్‌లను విక్రయిస్తున్నారు.

ఫిష్.. రష్

జగద్గిరిగుట్ట: వీకెండ్‌లో నాన్‌వెజ్ ప్రియులు ఫిష్ రుచి చూడాలనుకున్నారు కాబోలు. చికెన్, మటన్ షాపులలో కంటే ఎక్కువగా చేపలు మార్కెట్ వద్ద ఎక్కువ రష్ కనిపించింది. ఇటీవలే కురిసిన వానలకు చేపల ధరలు తగ్గాయనా.. పోషకాల ఎక్కువ ఉంటాయనా.. తెలీదు కానీ చేపలు కొనడానికి ఎగబడ్డారు.



రూ.లక్ష ఆర్థిక సాయం @ 22,077 దరఖాస్తులు

ఈనెల 25 వరకు అర్హులైన లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయంపై చర్యలు

- నియోజకవర్గానికి 300 మంది ఎంపికపై కసరత్తు
- జిల్లాలో దరఖాస్తులు 22,077 రావటంతో.. ఎంపికపై అయోమయం
- మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి నియోజకవర్గాల్లో 150 మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం

సాక్షి,మేడ్చల్ జిల్లా: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన బీసీ చేతివృత్తిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయం లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. ఈనెల 25వ తేదీ వరకు అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సాయం చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఒక్కో నియోజకవర్గంలో 300 మందికి తొలివిడతలో సాయం అందజేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రభుత్వం విడుదల చేసే నిధుల ఆధారంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసేందుకు జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

తొలి జాబితాపై..

దరఖాస్తులు వెల్లువెత్తిన నేపథ్యంలో లబ్ధిదారుల ఎంపిక అధికార యంత్రాంగానికి తలనొప్పి తెచ్చి



పెడుతోంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపీడీఓలు, పురపాలక సంఘాల కమిషనర్లు/క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన పూర్తిచేసి ప్రభుత్వానికి నివేదించారు. సీజీజీ (సెంటర్ ఆఫ్ గుడ్ గవర్నెన్స్) 298 డిగ్రీల ప్రకారం ఆధార్ అనుసంధానం ఆధారంగా లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూ.లక్ష ఆర్థిక సాయం కోసం 22,077 మంది దరఖాస్తులు చేసుకోగా, 1500 మంది దరఖాస్తుదారులను మాత్రమే మొదటి విడతలో అర్హులుగా తేల్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా ఈనెల 15న కలెక్టరేట్‌లో మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి అర్హులైన 150 మంది లబ్ధిదారులకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని జిల్లా మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. మిగతా ఉప్పల్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలకు సంబంధించి 100 మంది లబ్ధిదారులను గుర్తించినప్పటికీ నిధులు లేని కారణంగా పంపిణీ చేయలేకపోయినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నారు. అలాగే ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పెండింగ్‌లో ఉన్న 1350 మంది లబ్ధిదారుల ఎంపిక.. రూ.లక్ష పంపిణీపై సంబంధిత అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

> **మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక..**
>
> ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా రూ.లక్ష ఆర్థిక సాయం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపడుతున్నాం. దరఖాస్తులను ఎంపీడీఓలు, కమిషనర్లు క్షేత్రస్థాయిలో పరిశీలించి స్క్రూటినీ చేశారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన దరఖాస్తులను ప్రభుత్వానికి నివేదించాం. కలెక్టర్ నేతృత్వంలోని కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరుగుతోంది. – కేశూరామ్, బీసీ అభివృద్ధి శాఖ అధికారి, మేడ్చల్ జిల్లా

హడావుడిగా పరిశీలన..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో చేపట్టిన దరఖాస్తుల పరిశీలన తీరుపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఎంపిక చేసిన దరఖాస్తుల్లోని అర్హులకు కూడా ప్రాధాన్య క్రమంలో రూ.లక్ష ఆర్థిక సాయం చేయనున్నట్లు సమాచారం. మొదటగా ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధుల ఆధారంగా డివిజన్లు/వార్డులు, మండలాల ప్రాతిపదికన తీసుకుని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పూర్తిచేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

విరాళం

హఫీజ్‌పేట : కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమానికి 20 సీలింగ్ ఫ్యాన్లు ప్రఖ్యాత టెక్నాలజీ సంస్థ ఐల్యాబ్స్ డైరెక్టర్ తూములూరి కృష్ణ ప్రసాద్ ఆదివారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన సీఆర్ ఫౌండేషన్ చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను ప్రశంసించారు. కార్యక్రమంలో కృష్ణప్రసాద్ కుటుంబసభ్యులు సర్వాని, శివాని, హరిణి, ట్రెజరర్ చెన్నకేశవరావు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు





ఆల్విన్‌కాలనీ: దీనబంధుకాలనీలోని మైసమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొవ్వా సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు డా. కొరదాల నరేష్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గా ప్రసాద్, శ్రీనాథ్, రాజు, శివ, శ్రీనివాస్, అజ్జు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లపోచమ్మకు బోనాలు

కూకట్‌పల్లి: బాలాజీనగర్ డివిజన్‌లో నల్లపోచమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఈ వేడుకల్లో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హెచ్‌సీయూలో కొనసాగుతున్న విద్యార్థుల నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో విద్యార్థుల డిమాండ్లు పరిష్కరించేంత వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని హెచ్‌సీయూ స్టూడెంట్స్ యూనియన్ 2022-23 ప్రతినిధులు స్పష్టం చేశారు. ఆదివారం కూడా హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు నిరసన కొనసాగించారు. హెచ్‌సీయూలో అండర్ గ్రాడ్యుయేట్ , పోస్టుగాడ్యుయేట్ దరఖాస్తుల ఫీజు రద్దు చేయాలని, పీహెచ్‌డీ ఇంటర్వ్యూ కోసం విభాగాల్లో కుల ధ్రువీకరణ పత్రాల తప్పనిసరి సమర్పణను రద్దు చేయాలని, రిజిస్ట్రార్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని, సీఈని నియమించాలని, క్యాంపస్‌లోకి మతతత్వ శక్తులను అరికట్టడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూలోని పరిపాలనా భవనం ముందు రాత్రి, పగలు తేడాల లేకుండా నిరసన కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ టిఫిన్ బైఠక్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బీజేపీ ఎంకెఎస్ఆర్ గార్డెన్స్‌లో బీజేపీ నాయకులందరూ కలిసి టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అద్వానీ సూర్యారావు, వడ్డేపల్లి రాజేశ్వరరావు, సూర్యప్రకాష్ రావు, మూసాపేట కార్పొరేటర్ మహేందర్, కంటెస్ట్ కార్పొరేటర్‌లు ప్రీతంరెడ్డి, నర్సిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

గాయత్రినగర్‌లో

మోతీనగర్: మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులిగొళ్ల శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లోని అపార్టుమెంట్స్‌లో టిఫిన్ బైఠక్ చేపట్టారు. ప్రజా వ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు.



కూకట్‌పల్లిలో జరిగిన టిఫిన్ బైఠక్ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు